
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 3 జనవరి 2025 | HYDERABAD

# ఎల్ఆర్ఎస్ సంగతి అంతేనా..?

## ముందుకు కదలని భూ క్రమబద్ధీకరణ.. దరఖాస్తుల పరిశీలనలో అధికారుల నిర్లక్ష్యం

మేడ్చల్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంగతి అంతేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి.. భూక్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించినా.. అధికారులు మాత్రం దరఖాస్తుల పరిశీనలలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 1,43 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన లక్ష 43 వేల అర్జీలలో దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 16 వేల 2 వందల దరఖాస్తులను మాత్రమే పరిశీలించినట్లు తెలిసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం మూలంగానే దరఖాస్తుల పరిశీలన ముందుకు సాగడం లేదని తెలుస్తున్నది. దరఖాస్తుదారులు ఇచ్చిన దరఖాస్తుల్లో లేని ధ్రువపత్రాలను తిరిగి సమర్పించేలా ఎలాంటి అవగాహన కల్పించకపోవడం వల్ల దరఖాస్తుదారులకు ఏం చేయాలన్నది అర్థం కాకుండా పోతున్నది. జిల్లాలోని మున్సిపాలిటీలు, జిల్లా కలెక్టరేట్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నామా మాత్రంగానే ఏర్పాటు చేసినట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

**కృతజ్ఞతలు**



మేడ్చల్‌కు మెట్రో సాధనకు కృషి చేసిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు గురువారం మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రో సాధన కమిటీ ప్రతినిధులు సంపత్‌రెడ్డి, జార్జ్, మహేందర్‌రెడ్డి, గోరుగంటి వెంకటేశ్వర్లు, పుప్పాల నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. -కుత్బుల్లాపూర్



మెట్రో రైలు కల సాకారం చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెట్రో రైల్ సాధన సమితి నాయకులు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్యారడైజ్ నుంచి మేడ్చల్, జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వైపు మెట్రో రైలును విస్తరించాలని.. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం ప్రణాళికలు రూపొందించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మెట్రో రైలుకు ఆమోదం తెలపడంతో పాటు ప్రథమ ప్రాధాన్యతా క్రమంలో మొదలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్రో రైల్ సాధన సమితి నాయకులు సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.
-మల్కాజిగిరి, జనవరి 2





# ఆకట్టుకుంటున్న ఉద్యాన్ ఉత్సవ్

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవ్ ప్రదర్శనలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వివిధ వర్సిటీల,ఎన్‌జీఓ,కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్ నుంచి సుమారు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. తొలిరోజు సుమారు 6వేల మంది సందర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ ఉత్సవాలు జనవరి 2 నుంచి 13 వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయి. ప్రవేశం ఉచితం.

# గాడి తప్పుతున్న బల్దియా పాలన

### ఆమడ దూరంలో కౌన్సిల్..
### మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం
### ఐదు నెలలు గడిచినా పట్టని యంత్రాంగం
### 'స్టాండింగ్' సమావేశాల బాటలోనే పాలక మండలి
### చట్టాల అమల్లో అలసత్వం.. కమిషనర్ వైఖరిపై అసంతృప్తి

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో పాలన గాడి తప్పుతోంది. ఖజానాలో చిల్లిగవ్వ లేక అభివృద్ధి పనులు కుంటుపడిన పరిస్థితులు నెలకొన్నాయి. పురోగతిలో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రస్తుతం చట్టాల ఉల్లంఘన జరుగుతున్నది. వాస్తవంగా ప్రతి వారానికొకసారి స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాలి. మేయర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై చర్చించి రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు ఆమోదం దక్కుతుంది. గడిచిన కొన్ని నెలలుగా స్టాండింగ్ కమిటీ ముందుకు ఎజెండా అంశాలు రాకుండా సమావేశాలు వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు మరింత జఠిలమవుతున్నాయి. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడం పట్ల ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ కోవలోకి ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) చేరింది. గత జూలై 6న జరిగిన 9వ పాలకమండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబర్‌లో జరపాల్సి ఉంది. కానీ ఐదు నెలలు గడిచినా.. సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడటం లేదు. బల్దియా బడ్జెట్‌తో పాటు స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను కౌన్సిల్‌లో సభ్యుల ఆమోదం మేరకు పనులు పట్టాలెక్కాలి. కానీ ఈ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో నగర పౌరులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ప్రధానంగా సకాలంలో ప్రభుత్వం దృష్టికి వెళ్లడం అనుమానంగానే ఉంది. కౌన్సిల్ సమావేశం తేదీ ఖరారుపై కమిషనర్ ఇలంబర్తి కనీసం చర్చ ప్రస్తావనకు తీసుకురాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో రహదారిపై పేరుకుపోయిన చెత్త

మేయర్, కమిషనర్ల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫిబ్రవరి 20లోపు..

అక్టోబర్ నెలలోనే బడ్జెట్‌కి సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ డిసెంబర్ రెండో వారం వరకు సమయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ చట్టం -1955 ప్రకారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను గత నవంబర్‌లో బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటున్నది. ఈ నెల 10వ తేదీలోపు జనరల్ బాడీ మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ. 8440 కోట్ల బడ్జెట్‌ను నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి చేర్చుతారా? లేదంటే కాలయాపన చేస్తారా? స్టాండింగ్ కమిటీ సమావేశాల తరహాలోనే, కౌన్సిల్ సమావేశాల లక్ష్యాలను నీరుగారుస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

# గేటెడ్‌లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలా!

### నియంత్రించాల్సింది పోలీసులే..
### గేటెడ్ ప్రశాంతతకు మార్గదర్శకాలు రూపొందించండి
### సిటీ పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సిటీబ్యూరో: గౌరవప్రదమైన ప్రశాంత జీవనం గడిపేందుకు ఎక్కువ మంది గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకుంటున్నారు. గేటెడ్‌లో నివసించడం ప్రతిష్టాత్మకంగా ఫీలవుతారు. అటువంటి గేటెడ్‌లో అంతర్గతంగా జరిగే అసాంఘిక, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై నియంత్రణ లేకుండా పోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా గేటెడ్‌లో నివసించేవారు దాదాపుగా ధనికవర్గానికి చెందిన వారే కావడంతో వారిపై పోలీసులు, స్థానిక అధికారుల ప్రభావం లేకుండా పోతున్నది. ఈ విషయంలో సిటీ పోలీసులపై హైకోర్టు సీరియస్ అయింది. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లాల కమ్యూనిటీలో అక్రమంగా పేకాట, మద్యపానం, మత్తు పదార్థాల వినియోగం, లైంగిక చర్యలపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ అక్కడ నివాసముంటున్న సీహెచ్ హరిగోవింద ఖొరానారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా పోలీసులు వెళ్లి ఏమీ జరగలేదని తేల్చి చెప్పారు. కమ్యూనిటీలో సెక్యూరిటీ సిబ్బంది పోలీసుల రాకపై ముందస్తు సమాచారం ఇస్తుండడంతో ఆధారాలు మాయం చేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై విచారించిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్ విల్లాలతో పాటు నగరంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల పరిస్థితులను తీసుకొని మార్గదర్శకాలు రూపొందించాలంటూ సిటీ పోలీసు కమిషనర్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు. గేటెడ్ కమ్యూనిటీ జీవనశైలి పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ జరిగే చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టే అధికారం సిటీ పోలీసు చట్టం కింద పోలీసులకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అక్రమ కార్యకలాపాల నిమిత్తం గేటెడ్ కమ్యూనిటీల్లో ఏం చేయాలి.. ఏం చేయకూడదు అన్న అంశాలపై తగిన సలహాలు, మార్గదర్శకాలు రూపొందించి కమ్యూనిటీతో పాటు ప్లాట్ ఓనర్లకు జారీ చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మార్గదర్శకాలతో పాటు అనుసరించాల్సిన చట్ట నిబంధనలు, సర్కారు ఉత్తర్వులను కూడా అందించాలని సూచించింది. కమ్యూనిటీల నుంచి న్యూసెన్స్, నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్, టీజీఎన్‌సీబీలకు కూడా పోలీస్ కమిషనర్ తగిన ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంది. కమ్యూనిటీల్లో ఫిర్యాదుల స్వీకరణకు ఆయా ఠాణాల పరిధిలో సాధ్యమైతే యాప్ రూపొందించి వాటి ద్వారా ఫిర్యాదు చేసే వారి వివరాలను గోప్యంగా ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్ 22, ఇతర నిబంధనల కింద అధికారాలు ఉన్న నేపథ్యంలో మార్గదర్శకాలు రూపొందించి గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్లకు పంపాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

### సబ్ కమిటీ ఏర్పాటు చేయాలి..

కమ్యూనిటీ, ఫ్లాట్స్‌లో పబ్లిక్ న్యూసెన్స్, గేమింగ్, అనధికారికంగా మద్యం తాగడం వంటి నేరపూరిత సమస్యలుంటే అవి తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం, సహకార సంఘాల చట్టం కింద పరిష్కారం కాలేవని హైకోర్టు పేర్కొంది. పార్కింగ్, పెంపుడు కుక్కలు, మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించకపోవడం, పార్టీల నిర్వహణ, డీజేల పెట్టుకోవడం, క్లబ్ హౌస్ దుర్వినియోగం వంటి అంశాల్లో పొరుగు వారిపై చర్యలు తీసుకోవాలంటూ పలు పిటిషన్లు దాఖలు అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు హైకోర్టు పేర్కొంది. ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లా కమ్యూనిటీలో ఎగ్జిక్యూటివ్ కమిటీలో లేని వారితో ముగ్గురు సభ్యుల సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని ఓనర్స్ అసోసియేషన్‌ను ఆదేశించింది. ఏవైనా ఫిర్యాదులు అందితే తక్షణం ఎగ్జిక్యూటివ్ కమిటీకి తెలపాలని, ఒక వేళ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే సబ్ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. క్లబ్ హౌస్ వినియోగంలో చేయాల్సినవి, చేయకూడని వాటిపై సూచనలు రూపొందించి సభ్యులకు, నివాసితులకు అసోసియేషన్ సమాచారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.



# ఈశాన్య గాలులు.. గ్రేటర్ గజగజ

సిటీబ్యూరో: కిందిస్థాయి గాలులు ఈశాన్యం వైపు నుంచి తెలంగాణ మీదుగా వీస్తుండడంతో గ్రేటర్‌లో చలిగాలులు వీస్తున్నాయి. దీని వల్ల నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే తక్కువకు పడిపోయి చలి తీవ్రత పెరుగుతున్నది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.0 డిగ్రీలు, గాలిలో తేమ 29 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోవడంతో రాత్రి, ఉదయం సమయాల్లో చలి పులి వణుకు పుట్టిస్తున్నది.

# 163 అమలు

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 3, 4వ తేదీల్లో సీడీపీవో ఉద్యోగాల కోసం సీబీఆర్‌టీ పరీక్ష, అలాగే 6, 7వ తేదీల్లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 కోసం పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ 163(సీఆర్‌పీసీ 144) అమలులో ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు జరిగే తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

### సైబరాబాద్ పరిధిలో..

సైబరాబాద్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద 4రోజుల పాటు బీఎన్ఎస్ఎస్163(144)సెక్షన్‌ను విధిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడించారు. ఈనెల 3,4, 6, 7తేదీల్లో ఉదయం కమిషనరేట్ పరిధిలోని పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల దూరం వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడ ఐదుమంది లేదా అంతకు మించి గుమ్మిగూడటం, సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడం వంటివి నిషేధమని తెలిపారు.

# అమ్మో.. మళ్లీ వైరల్ జ్వరాలు

### అనేక మందికి దగ్గు..జ్వరం..జలుబు లక్షణాలు.. రోగులతో నిండిపోతున్న వైద్యశాలలు..
### వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యనిపుణులు..జాగ్రత్తలు పాటించాలంటూ సూచన

సిటీబ్యూరో: నగరంలో మళ్లీ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చాలా మంది జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో దవాఖానలకు క్యూ కడుతున్నారు. దీంతో గ్రేటర్ పరిధిలోని బస్తీ దవాఖానలు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా దవాఖానలు రోగులతో నిండిపోతున్నాయి. రెండు మూడు రోజుల నుంచి ఓపీ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో రోగులు దవాఖానకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వీరితో పాటు ఆస్తమా వంటి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు సైతం అనారోగ్యానికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు.

### వాతావరణ మార్పుల వల్లే..

వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్లే ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు వస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే వానాకాలం, చలికాలంలో సీజనల్ వ్యాధులు రావడం సర్వసాధారణమేనని, అలాగని సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తున్నారు వైద్యులు. సకాలంలో చికిత్స



తీసుకుంటే రెండు నుంచి మూడు రోజుల్లో వ్యాధి నయమవుతుందని, నిర్లక్ష్యం చేస్తే అది ఇతర అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నందున ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, చల్లటి వాతావరణానికి ఎక్కువగా ప్రభావితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమా వంటి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు, అలర్జీ బాధిత రోగులకు ఈ చలికాలం ఒక గడ్డుకాలంగా చెప్పవచ్చని, వీరు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### ఈ జాగ్రత్తలు పాటించండి

చల్లని పానియాలకు దూరంగా ఉండడం మంచిది. ఎప్పటికప్పుడు వండిన వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి.చలికి ఎక్కువగా ప్రభావితం కాకుండా జాగ్రత్తపడాలి. ద్విచక్ర వాహనాలపై పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా వారి చెవులకు టోపీలు లేదా మఫ్లర్లు, స్వెట్టర్ వంటి వెచ్చని దుస్తువులు వేయించాలి పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు అప్రమత్తంగా ఉండాలి.తేలికపాటి లక్షణాలున్నప్పుడే వైద్యులను సంప్రదించాలి.